# రంగుటద్దాలు

—మధుర



కొలింగ్ బెల్ మ్రోగింది.

"మళ్ళీ ప్రత్యక్షం!" చిరునవ్వు నొక్కివట్టి ముద్దుగా వినుక్కుంటూ తలుపు తీసిన శారద ఎదురుగా నిలబడిన వసంతని చూసి తనకళ్ళను తానే నమ్మలేకపోయింది. రెండు భుజాలమీదా చేతులువేసి కుదిపేస్తూ, "ఇదేమిటే ఉత్తరమైనా లేకుండా ఊడి పడ్డావు? మరిది గారేరి? ఎప్పుడు బయలుదేరావు? పదపద... ముందు కాళ్ళు మొహం కడుక్కో. కాఫీ తాగి తర్వాత స్నానం చేద్దువుగాని. మీ బావగారిప్పుడే ఆఫీసుకెళ్లారు. మళ్లీ ఆయనే తిరిగి వచ్చారనుకున్నాను. అదేమిటలా క్వశ్చన్ మార్కు ముఖం పెట్టావు? అలాగే ఏదో మర్చిపోయానంటూ రెండేసి సార్లు తిరగటం మామూలే!" నవ్వింది శారద.

హడావుడిగా వంటింట్లోకి లాక్కుపోయి కాఫీకి నీళ్ళు పడేస్తూనే "ఇప్పుడు చెప్పు. ఒక్కదాన్నీ రానిచ్చాడా మీ ఆయన? కనీసం ఉత్తరాలైనా రాయవేమే బాబూ? మొద్దూ! మాట్లాడవేం? ప్రాణాలన్నీ మీ ఆయన దగ్గరే వదిలేసి వచ్చినట్లున్నావు?"

నవ్వింది వసంత.

"ఏదీ నువ్వు ఊపిరాడనిస్తేనా? మీ మరిదిగారు పది రోజులు కాంపుకెళ్లారు అమ్మ వాళ్ళదగ్గర దింపి. నిన్ను చూసి చాలా రోజులైందని ఇలా వచ్చాను. సరేనా! ఇకనైనా కాఫీ పొయ్యి. ఉండు. బాత్‌రూమ్‌కి వెళ్ళొస్తాను."

వసంత అటు వెళ్లగానే శారద భర్తకు ఫోన్ చేసింది.

"నిజమేనండీ! ఆయన కాంపుకు వెళ్ళాడుట. ఒక్కతే వచ్చింది. కనీసం ఒక వారమైనా వుంటుంది. ఈలోగా దానికి అన్నీ చూపించేయాలి. మీరు ఈ నాలుగురోజులూ సెలవు పెట్టేయరాదూ? అబ్బ! మీరు మరీ వేషాలు నేర్చుకున్నారు లెండి. మహా తమరు సెలవు పెడితే ఆఫీసు తల్లక్రిందులయిపోయేట్లు పెద్దబడాయి! ఇంటికి రండి. మీవని చెప్తాను." ఫోన్‌లో అక్క సంభాషణ వింటూ నవ్వుకుంది వసంత.

శారదా, వసంతా ఇద్దరూ కవలపిల్లల్లా ఉంటారు. ఏణ్ణర్ధం తేడా ఇద్దరికీ. శారదకి చదువుమీద శ్రద్ధలేదు. ఎలాగో స్కూలుఫైనలు గట్టెక్కించి ఇంట్లో కూర్చుంది. వసంత మంచి మార్కులతో అక్కతోపాటు అదే ఏడాది పాసై కాలేజీలో చేరింది. బి.ఎ. మొదటి సంవత్సరంలోకి రాగానే దూరపుబంధువుల అబ్బాయి, వరస కలిసిందని శారదకు స్థిరం చేశారు. అదే ముహూర్తానికి వసంతకు రమణారావుతో వివాహం నిశ్చయం చేశారు. శారద భర్త నారాయణ ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటే, వసంత భర్తతోపాటు రూర్కెల్లా వెళ్ళిపోయింది. పెళ్లయి ఏడాది కావస్తోంది. ఏ పండగకు గమ్మన్నా సెలవు లేదనేవాడు రమణారావు. మళ్ళీ ఇదే అక్కాచెల్లెళ్లు కలుసుకోవటం. తల్లిదండ్రులు విజయవాడలో వాళ్ల తాతలనాటి పాతఇంట్లో కృష్ణారామా అంటూ కాలక్షేపం చేస్తున్నారు. కొడుకులు లేరే అన్న బాధ మనసులో ఉన్నా ఇంతే ప్రాప్తి అని సరిపెట్టుకున్నారు.

వచ్చిన దగ్గర్నుండి వసంతని ఓ కంట కనిపెడుతూనే ఉంది శారద. దేనికీ ఉత్సాహం చూపించటం లేదు. మన్ను తిన్న పాములా ఉంటోంది. కొత్తగా పెళ్లయిన హుషారు లేనేలేదు. నారాయణ మంచి సరదా అయిన మనిషి. చనువుగా అందర్నీ పలకరిస్తూ, నవ్విస్తూ ఉంటాడు. వసంతని ఆటలు పట్టిస్తూనే ఉన్నాడు. అయినా ముడుచుకుపోయి తప్పించుకు తిరుగుతోంది. 'సినిమాకు వెళ్దామా, షికారుగా అలా తిరిగి వద్దామా' అంటే "నాకు రావాలని లేదు శారదా! నువ్వు కబుర్లు చెపితేనే బాగుంటుంది. పోనిద్దూ" అని తేల్చేస్తోంది. వేవిళ్లేమో అని ఆరా తీసింది. కాదని తేలిపోయాక భార్యాభర్తల మధ్య ఏదైనా గొడవ వచ్చిందేమోనన్న అనుమానం ధ్రువపడింది. వచ్చి వారమౌతుంది. వసంత ఉత్తరం రాయలేదు. పోనీ అతని దగ్గర్నుండి అయినా రాలేదు. కొత్తదంపతులు ఇలాగే ఉంటారా? తనైతే రోజూ ఉత్తరం రాసేది నారాయణకు. మెల్లిగా భర్త చెవిలో ఊదింది.

"సరిసరి. నేను అనుకుంటూనే ఉన్నాను" అనేశాడు.

"ఎలా అనుకున్నారు?" నిలదీసింది.

"భర్త నాలా మెత్తనివాడైతే మీ చెల్లికి నీలాగే రెండు కాళ్లూ ఒకచోట నిలవకుండానే ఉండేది కదా!"

"ఆహా! అలాగా! పాపం! ఎంత మెత్తన!" గిల్లింది శారద. గట్టిగా అరవబోయి తమాయించుకున్నాడు "రక్షసీ" అంటూ.

"ఏమ్మా! నొప్పేసిందా?" బుంగమూతి పెట్టిన అతన్ని బుజ్జగించింది.

"సర్లే! ఇంతకీ ఏమంటావు?"

"అసలేమిటో సంగతి అదేమీ చెప్పటం లేదు. మీరు అతని దగ్గరకు వెళ్తే తెలుస్తుందేమో!"

ఉలిక్కిపడ్డాడు.

"భలేదానివే! పెళ్లిలో చూడటమే. మళ్లీ అతని మొహం చూడలేదు. నీ బ్రహ్మాండమైన తెలివితేటలతో లేనిపోని గొడవలు సృష్టించకు. 'మియా బీబీ రాజీ తో క్యా కరేగా బాజీ?' భార్యాభర్తలన్న తర్వాత తిట్టుకుంటారు కొట్టుకుంటారు. మధ్యలో కల్పించుకోవటం బుద్ధిమంతుల లక్షణం కాదు."

> జీవితాన్ని ఆనందమయం చేసుకోదలచినవారు విశాల దృక్పథంతో అందరి పట్లా ఆదరభావంతో వ్యవహరిస్తూ, ఇతరుల సంతోషంలో తాము ఆహ్లాదాన్ని పొందుతూ వుంటారు. కానీ వక్రబుద్ధి గలవారు—రకరకాల అనుమానాలతో సంకుచిత మనస్తత్వంతో ఇతరులను మానసికంగా హింసిస్తూ వుంటారు. అలా హింసించే వ్యక్తి భర్తగా లభించినప్పుడు అతనిపట్ల భార్య ఎలా ప్రవర్తించాలి?

సీరియస్‌గా వెళ్లిపోతున్న నారాయణని "ఇదిగో మర్యాదస్తుడు గారూ!" అని చొక్కా పట్టుకుని ఆపింది.

"మనకంటె చిన్నది. దాని సంగతి మనం పట్టించుకోకపోతే ఎలా? లోకంలోని భార్యాభర్తలందరూ మనలాగే ఉండాలని మీరు ఎన్నిసార్లు అనలేదూ?" గడ్డం పట్టుకుని ఉబ్బేసింది.

"సంగతి ఇదీ అని తెలిస్తే ఏమైనా చేయగలంగానీ అనవసరంగా ఊహాగానాలు చేయటం నాకు నచ్చదు శారదా!" అనేశాడు నారాయణ.

* * *

వీళ్లవాదన తెగకుండానే మర్నాడు ప్రత్యక్షమయ్యాడు రమణారావు. నానా హడావుడి చేసింది శారద. అతను పది మాటలకొకమాట చెప్తున్నా 'కొత్తకదా! అందుచేత ముభావంగా ఉన్నాడ'ని సరిపెట్టుకుంది. భోజనంలోకి ఎన్నో తయారుచేసింది. అయినా ఇంకా ముడుచుకుపోయినట్లు ఉన్న వసంతని గమనిస్తూనే ఉంది. ఇన్నాళ్లకు చూశానన్న సంతోషం ఏమీలేదు. ఇద్దరూ ఎడమొహం, పెడమొహంగానే ఉన్నారు. ఏమిటా అని అనుకుంటూనే లోటు భర్తీ చేయటానికన్నట్లు తనే ఎక్కువ మాట్లాడుతోంది. భోజనాల దగ్గర 'నలుగురూ కూర్చుని తిందాం సరదాగా రావే' అంటే వసంత ఒప్పుకోలేదు. "తర్వాత తిందాంలే అక్కా! వాళ్ళకి పెట్టేయి" అంది. బలవంతం చేస్తే ఆకలి లేదంది. నారాయణ కల్పించుకుని, "మా తమ్ముణ్ణి చూసి మీ చెల్లెలి కడుపు నిండిపోయింది లేవేయ్! మాకు వడ్డించేయి త్వరగా!" రాయిలా కూర్చున్నాడేకాని రమణారావు మర్యాదకన్నా చిరునవ్వు నవ్వలేదు. కొసరి కొసరి వడ్డిస్తోంది శారద. ఒద్దని చెయ్యి అడ్డం పెడుతున్నాడు కాని మొహమాటానికన్నా ఏ పదార్థమూ బాగుందని అనలేదు. నారాయణ గలగలా మాట్లాడుతూనే ఉన్నాడు.

"నా పెళ్లి అయ్యాక ఇన్ని ఐటమ్సు ఈవిడ చేయటం ఇదే మొదటిసారండీ! నిజంగా మీకు థాంక్సు చెప్పాలి. పులిహోర బాగా కుదిరింది. ఆవడలు నోట్లో కరిగిపోతున్నాయి గులాబ్‌జాముల్లాగా. ఏదీ ఇంకో రెండు రానియ్యి. ఇంతకీ మీకు ఉంచుకున్నారా లేదా?"

శారదకు భర్త మెప్పుదల సంతోషంగానే ఉన్నా ముంగిలా ఉన్న మరిది ముందు నారాయణ అలా ఫుల్‌స్టాప్ లేకుండా మాట్లాడటం చిరాకనిపించింది.

"చాల్లెండి. ఎప్పుడూ తిననట్లు ఏమిటా మాటలు?" నారాయణ ఏమాత్రం కోపగించుకోలేదు.

"ఎప్పుడూ తినటం వేరోయ్! మీ ఆడవాళ్ళు ఇంట్లో రోజూచేసే వంటేకదా అని అశ్రద్ధగా చేసి పారేస్తారు. వేరేవాళ్ళు వస్తేమాత్రం మెప్పుదలకోసం కష్టపడి చేస్తారు. కట్టుకున్నవాడి ఎదుట ఎప్పుడూ పాతచీరలో ప్రత్యక్షం. అదే ఏ సినిమాకన్నా షికారుకైనా అయితే ఫాషన్‌పెరేడ్‌కి వెళ్తున్నట్లుగా తయారవుతారు. బయట వాళ్ళకి బాగా కనిపించాలనే తాపత్రయంలో పదోవంతు సొంతమొగుడి మీద ఉండదు. ఏమంటావు? వీడెక్కడికి పోతాడులే అని ధీమా!"

ఈసారి చిరునవ్వు ఆపుకోలేకపోయాడు రమణారావు.

"అమ్మయ్య! మబ్బు తొలిగింది!" అనుకుంది శారద. "రేపటినుండి రోజుకొకటి చొప్పున జంట నగరాల విశేషాలన్నీ చూసేద్దాం. నేను సెలవు పెట్టేస్తాను నాల్గురోజులు" హుషారుగా అన్నాడు నారాయణ.

"అబ్బే! నాకు సెలవు లేదండీ! రేపే వెళ్ళాలి" రమణారావు మాటలకి నారాయణ. శారద మొహాలు చూసుకున్నారు.

"అదేమిటి? కనీసం నాల్గురోజులుండరూ? ఇదే మొదటిసారి మీరు మా ఇంటికి రావటం!" అంది శారద.

"కావాలంటే మీ చెల్లెల్ని ఉంచుకోండి. నాకు సెలవు లేదు." అతని ధోరణికి విస్తుపోయి మళ్లీ మాట్లాడలేదు శారద.

"పోనీ ఈసారి పదిరోజులన్నా ఉండేట్లు రండి." వాతావరణాన్ని తేలికపరచాలని అన్నాడు నారాయణ. సమాధానం చిరునవ్వే.

* * *

రాత్రి పడగ్గదిలో నారాయణ చేతుల్లో ఉందన్న మాటేకానీ శారద దృష్టంతా పక్కగదిలోనే ఉంది. సన్నగా వినవస్తున్నది అతనిగొంతు. తేలిగ్గా ఫీలయింది. ఫర్వాలేదు. పెళ్లాం దగ్గరన్నా నోరు తెరిచాడు. కొత్తవాళ్లమని మొహమాటపడి ఉంటాడు అనుకుని నిద్రపోయింది హాయిగా. మధ్య రాత్రి మెలకువ వచ్చి బాత్‌రూమ్‌కని లేచింది. వాళ్లగది కిటికీ దాటి వెళ్ళాలి. కిటికీ తెరిచి ఉంది. మాటలు వినిపిస్తున్నాయి. సంకోచంతో ఆగిపోయింది.

"అయినా పరాయి మగాడన్న భయం, భక్తి ఏమైనా ఏడిస్తే కదా! అసలు మీనాన్న పెంపకంలోనే ఉంది లోపం! మిమ్మల్ని అని ఏం లాభం? సోషల్‌గా వుండాలని, మాడరన్ లైఫ్ అంటూ మగాళ్ళందరితో పూసుకు తిరగటం, ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం. బుద్ధి ఉండక్కరలేదూ? ఆడజన్మ ఎత్తాక ఎవరేమనుకుంటారోనన్న బెరుకు లేనే లేదు. నిన్ను మించిపోయింది మీ అక్క. అసలు మీ అమ్మా వాళ్ళదగ్గర ఉండకుండా ఇక్కడికెందుకు వచ్చావో అర్థం అయింది. మీ బావకసలు మగాళ్ళ లక్షణాలేమీ లేవే! బఫూన్‌లా అందర్నీ నవ్వించటమే జీవిత లక్ష్యంలా ఉంది. అవునూ... నిన్ను చేసుకోకుండా మీ అక్కని చేసుకున్నాడేం? మీకు బంధువు కదా! కాలేజీలో వెలగబెట్టిన నిన్ను కాకుండా స్కూల్‌ఫైనల్‌తో ఆపేసిన మీ అక్కను వరించాడంటే ఏదో కారణం వుండే వుంటుంది. నీవు నడిపిన ప్రేమాయణం ఏదో తెలిసిపోయి ఉంటుంది. పాపం! గొడవ కాకుండా చదువు మాన్పించి నాకు కట్టబెట్టారు. అవునా?"

వింటున్న శారద రక్తం గడ్డకట్టుకుపోయింది. ఏమిటీ? నిజమా? ఇదంతా కలా? అనుకోకుండా కిటికీలోంచి తొంగి చూసింది. మంచం మీద మోకాళ్ళచుట్టూ చేతులు బిగించి, తలవంచుకుని బొమ్మలా కూర్చుంది వసంత. అతను అటూఇటూ పచార్లుచేస్తూ సిగరెట్ అంటించుకుని కిటికీ దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. దడదడలాడే గుండెలతో గోడకు అతుక్కుపోయింది శారద. కదలటానికే కాదు. ఊపిరి పీల్చటానికే భయం. అతను చూస్తాడేమో! కోపాన్ని అసహ్యాన్ని భయం మింగేసింది. మెల్లగా, చెవిలో చెప్తున్నట్లు వినిపించాయి అతని మాటలు. "సరే! అయిందేదో అయిపోయింది. ఇకనైనా సరిగ్గా ఉంటే చాలు. పిచ్చివేషాలు మాని మర్యాదగా మసలటం నేర్చుకో. ఇంకా మీ అమ్మా నాన్నా బ్రతికే ఉన్నారు కాబట్టి అక్కడికి వెళ్లటానికే నీకు పర్మిషన్ ఉంది. నేనక్కడ దింపితే ఇక్కడికెందుకు వచ్చినట్లు? మాట్లాడవేం?" కఠినంగా ఉంది గొంతు.

"అక్కను చూసి చాలా కాలం అయిందని అమ్మా నాన్నా పంపించారు" ఎలాగో గొంతు పెగుల్చుకుంది వసంత.

"దేంట్ టెల్‌మీ స్టోరీస్... అంతగా అక్కను చూడాలనుకుంటే రమ్మని వ్రాయవచ్చుగా? నువ్వే ఎందుకు పరుగెత్తుకు రావాలి?"

రోషంగా తలెత్తింది వసంత "ఉత్తరం అంది అది వచ్చేసరికే ఎన్ని రోజులౌతాయి? మళ్ళీ మీరు వచ్చేస్తారు కదా! కలిసి ఉన్నట్లే ఉండదు. అందుకని నేనే బయలుదేరాను. తప్పా?" ఏడుపు కోపం కలిసి ఉన్నాయి ఆమె కంఠంలో.

"అవును. తప్పే!" స్థిరంగా ఉంది గొంతు. "ఒకరినొకరు చూసుకోవటానికి ఎంతసేపు కావాలి? అక్కను చూడటం అన్నది ఒక వంక. అవునా?" వెటకారంగా నవ్వాడు రమణారావు.

"ఇక చాలు" గట్టిగా అంది వసంత రెండుచేతులు జోడించి "మీకు దణ్ణం పెడతాను. ఇక మాట్లాడకండి. ఇంకెప్పుడూ ఇలాంటి తప్పు చెయ్యను. ప్లీజ్! ఇక మాట్లాడకండి" ఏడుస్తూ బోర్లా పడిపోయింది మంచం మీద.

ఒక్కక్షణం సూటిగా చూసిన రమణారావు "ఆల్‌రైట్! ఐ విల్ సీ" అంటూ లైటు స్విచ్ ఆఫ్ చేశాడు.

శారద మనసంతా శూన్యమైపోయింది. ఆలోచించగలిగిన స్థితికి వచ్చినప్పుడు నిద్రపోతున్న నారాయణను చుట్టుకుని బావురుమంది. ఉలిక్కిపడి లేచి కంగారుగా "ఏమైంది పిచ్చీ?" అని దగ్గరకు తీసుకున్నాడు. తనను తాను సంబాళించుకుని శారద మెల్లిగా చెప్పినదంతా విన్న నారాయణ సీరియస్‌గా అయిపోయాడు.

"అందరూ ఒకేలా వుండరు శారదా! ఎన్నోరకాల మనుషులూ, మనస్తత్వాలూ ఎదురౌతాయి మనకు. మనం అనుకున్నట్లే అందరూ ఉండాలనీ, ఉంటారనీ అనుకోవటం, వాస్తవంలో దానికి విరుద్ధంగా ఉన్నప్పుడు బాధపడటం సరికాదు. సినిమాల్లోలాగా, డ్రామాల్లోలాగా ఎవరినైనా మనం మార్చగలం, ఉద్ధరించగలం అని అనుకోవటం భ్రమ. ప్రతి మనిషికీ జీవితంలో తానుచేసిన పొరపాటు తానే తెలుసుకునే క్షణం వస్తుందనే నా నమ్మకం. సమయం మించిపోకుండా ఆ క్షణం వచ్చి వసంత జీవితం సుఖంగా జరిగిపోవాలని ఆశించటం

తప్పు మనం చేయగలిగిందేమీలేదు. భార్యాభర్తల మధ్య ఎన్నో సున్నితమైన విషయాలుంటాయి. మూడో మనిషి కలగజేసుకోవటం సంస్కారహీనం. నీకెంత దగ్గరి వాళ్ళయినా సరే—చూసి ఊరుకోవటమే ఉత్తమం. అయితే ఒకపని చేయవచ్చు. వసంత ధైర్యం కోల్పోయి నిరాశపడిపోకుండా అతని స్వభావాన్ని ఓపిగ్గా మార్చే ప్రయత్నం చేయాలి. 'ఇకఇంతే' అన్న నిరాశ ఆమెలో పెరిగితే పరిస్థితి మెరుగుఅవదు సరికదా ఇంకా హీనమై పోతుంది. అందుకని నీకు చేతనైతే వసంతకు ధైర్యం చెప్పి, ఆమె ఆత్మ విశ్వాసంతో మెలిగేలా చూడు. తన ప్రవర్తనతో అతనికి నమ్మకాన్ని పెరిగేట్లు చేసుకోవాలి. తర్వాత మెల్లగా అతనిలో పాతుకునిఉన్న మలినభావాల్ని పెళ్లగించే ప్రయత్నం చేయాలి. ఇది చెప్పినంత సులభంకాదు కాని చేయవలసింది మాత్రం అదే!''

నిదానంగా ఆలోచిస్తే భర్త మాటలు సబబేనని పించాయి శారదకు. అందుకే మర్నాడు ప్రయాణం అయిన చెల్లెల్ని ఆపటానికి ప్రయత్నించలేదు. ఉదయం నుండి తన భర్త ముఖంకేసి కన్నెత్తి చూడని శారదని చూసి ఆమెకంతా తెలిసిపోయిందని అర్థం చేసుకున్న వసంత—బొట్టుపెట్టి చీర ఒడిలోపెట్టిన అక్కను పసిపిల్లలా చుట్టుకుపోయింది. అతి ప్రయత్నం మీద నిగ్రహించుకున్న శారద చెల్లెలి కళ్ళు తుడిచింది.

''వసంతా! బేలగా అయిపోకు. రంగుటద్దాలతో చూసేవాళ్ళకు లోకమంతా రంగుగానే కనిపిస్తుంది. కుంటి, గుడ్డి, అవిటి వాళ్ళను చూసి వాళ్ల అంగవైకల్యానికి జాలిపడతాం. ఇదీ ఒకవిధమైన మానసిక వైకల్యమే. ఈ జాడ్యాన్ని వదిలించటానికి నువ్వు ప్రయత్నించాలి. కష్టమో, నిష్ఠురమో అతనితో జీవితాన్ని పంచుకున్నందుకు అతని లోటుపాట్లను కూడా భరించాల్సినదానివి నువ్వే. ఓపిక ఉన్నంతవరకు ధైర్యంగా ప్రయత్నం చేయాలికాని అతని మాటలకు సిగ్గుపడి, భయపడి, అసహ్యపడి ముడుచుకుపోయినా, కోపంతో వాదన పెంచినా ఇంకా పరిస్థితి చెడిపోతుంది తప్ప లాభంలేదు. ఓపిగ్గా నీకిష్టం లేకపోయినా అతనితో ఏకీభవించినట్లు ప్రవర్తించి నీమీద నమ్మకాన్ని పెంచుకో. కష్టమే అయినా అతని దృష్టిదోషాన్ని అతనికే తెలిసేట్లు బూజు పట్టి కుళ్లిపోయిన భావాల్ని మార్చుకునేట్లు చేయాల్సిన బాధ్యత నీదే. బి బ్రేవ్. డీలాపడిపోకు. ఇలాంటివాళ్ల వల్ల ప్రేమతో వ్యవహరిస్తేనే నువ్వు చెప్పినట్లుగా విని మారే అవకాశం ఉంది. రాయి అయినా కెరటాల తాకిడికి సున్న బడటం చూశావుకదా! నిరాశతో దూరంగా మెలిగిన కొద్దీ అతని అభిప్రాయాలు బలపడతాయి తప్ప మంచి జరగదు. చిన్నపిల్లలు అలిగినప్పుడు మనల్ని కొట్టినా, తిట్టినా మనం కోపగించుకోం. అలాగే ఇదీ ఒకవిధమైన మూర్ఖత్వమే. నీ ఓపికమీద నీ గెలుపు ఆధారపడివుంది. ధైర్యంగా ఉండు'' అంటూ భుజం తట్టింది.

అక్కమాటలతో కుదుటపడిన వసంత ఆత్మవిశ్వాసంతో రమణారావుతో పాటు ముందుకు నడిచింది. □



# బామ్మగారి పేజీ

చిన్న చిన్న విషయాల్లో నిర్లక్ష్యం చెయ్యడం మన వాళ్లకి అలవాటేనర్రా... ఎందుకు చెబుతున్నానంటే మా పక్కింట్లో పార్వతమ్మగారి ఆరేళ్ల కొడుక్కి జబ్బుచేసింది. దానికి కారణం—వైద్యుడేమన్నాడో తెలుసునా... దంతధావనం సరిగ్గా చేసుకోక పోవడం వల్లనే అని. ఆవిడ 'బెడ్‌కాఫీలు' పిల్లవాడికి అలవాటు చేసింది. నిద్దట్లోనే ఆ కాఫీగొంతులో పోసుకోడం మళ్లీ పడుకోడం, స్కూలుకు టైమవుతుందని ఆ తర్వాత ఆవిడ విసుక్కుంటూ లేపడం, ఆ అబ్బాయి ఆదరబాదరాగా పళ్లు తోముకోడం, స్నానం వగైరాలు చిటికెల్లో కానిచ్చి రావడం—ఇది రోజువారీగా జరిగేదే. కానీ హఠాత్తుగా ఆ అబ్బాయికి విపరీతమైన పంటినొప్పి, జ్వరం రావడంతో పళ్ల శుభ్రత గురించి వైద్యుడి దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది—

ఇంతకీ నే చెప్పేదేమిటంటే—

మన పళ్లను, నోటిని శుభ్రంగా ఉంచుకోకపోవడమే చాలా జబ్బులు మనకు రావడానికి అసలు కారణం. అంచేత పిల్లలకు పళ్లు ఎలా తోమాలో నేర్పడంతో పాటు అవి శుభ్రంగా ఉంచుకోకపోతే జబ్బులు వస్తాయనే విషయం కూడా తెలియబరచవలసిన బాధ్యత తల్లుల మీద వుంది.

చిన్ననాటి అలవాట్లు చాలావరకు పెద్ద వాళ్లయ్యాక కూడా అలాగే ఉంటాయి. అంచేత చిన్న పిల్లలకు మంచి మాటలు చెప్పి, అప్పుడే చక్కదిద్దాలి. చిన్నప్పుడు అలా వదిలేస్తే, పెరిగి పెద్దయిన తర్వాత మంచి అలవాట్లు కొత్తగా నేర్చుకోవాలంటే కష్టం.

ఆరోగ్యంగా వుండాలంటే, ఆహారాన్ని చక్కగా నమిలి మింగడం అవసరం. అలా ఆహారాన్ని నమిలి మింగడానికి పళ్లు ఆరోగ్యంగా ఉంచుకోవడం అంతకన్న అవసరం. అంచేత చిన్నతనం నుంచే పిల్లలకు మెత్తని టూత్‌బ్రష్‌లతో పళ్లపొడిగానీ పేస్టుగానీ ఉపయోగించి పళ్లు నిలువుగా తోముకోడం నేర్పడం మంచిది.

మామూలుగా పిల్లలకు మొదట మొలిచే పళ్లు—వీటినే పాలపళ్లు అంటారు, రాలిపోయి వాటికి బదులు కొత్త పళ్లు మొలుస్తాయి. ఇలా రెండోసారి మొలిచే పళ్లు రాలిపోతే, ఇక మళ్లీ పళ్లు మొలవవు. ఏ కట్టుడు పళ్లో కట్టించుకుని కాలక్షేపం చెయ్యాల్సిందే మరి.

చిన్న పిల్లలకు పళ్ల జబ్బు ఏమైనా వస్తే ఎలాగూ పాలపళ్లు పడిపోయి, కొత్తపళ్లు వస్తాయి కదా అని అశ్రద్ధ చెయ్యకూడదర్రా.... ఓ చిన్న పిల్లకు పన్ను రాలిపోయిందనుకోండి దాన్ని అలాగే వదిలేస్తే పక్కనున్న పళ్లు దాని చోటిని ఆక్రమించి మళ్లీ కొత్త పన్ను మొలవడానికి అడ్డువస్తాయి. ఇలా అయితే పళ్ల వరస సక్రమంగా ఉండక కొక్కిరి బిక్కిరిగా తయారవుతుంది. వాటిని శుభ్రం చెయ్యడమూ కష్టమవుతుంది. అలా వదిలేస్తే—ఆ పిల్లలకు పళ్ల జబ్బులు, వాటితో తక్కిన జబ్బులూ వచ్చి ఆరోగ్యం చెడిపోతుంది. అంతేకాదు. అలా వదిలేస్తే అసలు కొత్తగా పన్ను మొలవకపోవడం, ఒక వేళ మొలిచినా—అది ఏదో లోటుతో మొలిచే ప్రమాదంవుంది.

ఇక—చాలామంది పిల్లలు నోట్లో వేలు ఉంచుకుని ఎడతెరిపి లేకుండా చీకేస్తూ వుంటారు. అలా చేయడం వల్ల ముందు వరసపళ్ల అమరిక కాస్త మారుతుంది. ఆ పిల్లలు వేళ్లు చీకడం మానేశాక పళ్ల అమరిక మామూలు స్థితికి చేరుకుంటుంది.

దేహారోగ్యం పళ్లమీద ఆధారపడి ఉందనే సంగతి గుర్తుంచుకుని, వేపపుల్లలు కచ్చిక ఉపయోగించినా సరే, లేదా వాటి రక్షణకు పనికి వచ్చే పళ్లపొడులు పేస్టులు ఉపయోగించినా పళ్లకి, ఒంటికి మంచిదర్రా... అలాగే మరో విషయం కూడా మర్చిపోకూడదు. అల్పాహారం గానీ, భోజనంగానీ చేసిన తర్వాత నోరు పుక్కిలించడం, రాత్రిపూట నిద్రించేముందు ఓసారి పళ్లు తోముకోవడం ఆరోగ్యానికి మంచిది.

పళ్ల గురించి ఎప్పుడూ ఎలాంటి అనుమానాలు వచ్చినా, దంతవైద్యులను సంప్రదించడం మంచిదీ అవసరం కూడానర్రా—

★★★